# వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు

## జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆదేశం!



గుంటూరు జిల్లా ఆగస్టు 29 : వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, వారి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ సి యం సాయి కాంత్ వర్మ ఆదేశించారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్దులు తమ సమస్యలను సులభంగా తెలియజేసి పరిష్కారం పొందేలా జిల్లా కలెక్టరేట్‌లో శనివారం ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వికలాంగులు, వృద్ధులు తమ వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రేషన్, ఆరోగ్యం, ధ్రువపత్రాలు తదితర అంశాలకు సంబంధించిన అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారి సమస్యలను ప్రత్యేకంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

# వ్యవసాయ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం

## అసోసియేట్ డీన్ డా. పి. ప్రసూన రాణి ఆధ్వర్యంలో వేడుకలు



బాపట్ల ఆగస్టు 29 : శారీరక దృఢత్వంతోపాటు మానసిక స్థైర్యాన్ని నింపే ఏకైక రంగం క్రీడా రంగమని, ప్రతి ఒక్కరు రోజుకు కనీసం ఒక గంటపాటు క్రీడా మైదానంలో తమకు నచ్చిన క్రీడను సాధన చేయడం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. ప్రసూన రాణి అన్నారు. వ్యవసాయ కళాశాలలో నిర్వహించబడిన జాతీయ క్రీడా దినోత్సవము సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాకీ క్రీడలో భారత దేశానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు ఆర్జించిపెట్టి మూడు సార్లు ఒలంపిక్ క్రీడల్లో బంగారు పతకాలను సాధించి హాకీ విజార్డ్ గా పేరుగాంచిన ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చాంద్ పేరిట ఈ ఉత్సవాన్ని జరపడం ముదావహమన్నారు. ధ్యాన్ చాంద్ 121 వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పిస్తూ ఆమె భారత్ ఆడుతుంది, భారత్ గెలుస్తుంది నినాదంతో యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడమే ఈ క్రీడా దినోత్సవం యొక్క లక్ష్యమని, ఇదే నినాదాన్ని వ్యవసాయ విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించి కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావాలని, మానసికానందాన్నిచ్చే క్రీడలు విద్యా వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పీజీ పరీక్షను అత్యంత పటిష్టంగా, నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశం!



బాపట్ల జిల్లా ఆగస్టు 29 : నీట్ పీజీ పరీక్ష అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. నీట్ పీజీ పరీక్ష పర్యవేక్షణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. నీట్ పీజీ పరీక్షను కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నందున అధికారులు సమగ్ర ప్రణాళిక, నిబద్ధతతో విధులు నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. 30వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని రెండు పరీక్షా కేంద్రాలలో నీట్ పీజీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో జరగనున్న రెండు పరీక్ష కేంద్రాలలో 496 మంది అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. పూర్తిస్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జామర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా నిర్వహిస్తున్న నీట్ పీజీ పరీక్షకు ఏలాంటి అవాంతరాలు జరగకుండా విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆయన సూచించారు. నీట్ పరీక్షా కేంద్రాలకు జిల్లా నోడల్ అధికారిగా చీరాల ఆర్డీవో నరసింహారావును నియమించినట్లు తెలిపారు. లా అండ్ ఆర్డర్ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఎలాంటి ఆటంకాలు చేయకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు సీనియర్ అధికారులు నియమితులయ్యారని, పరీక్షను పర్యవేక్షిస్తారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ఇద్దరు వైద్యులను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసు అధికారులు పర్యవేక్షించాలన్నారు. వాహనాల పార్కింగ్ సమస్య రాకుండా చూడాలన్నారు. నియమితులైన ఉద్యోగులు మినహా మిగిలిన వారు ఎవరు పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో చీరాల ఆర్డీవో నరసింహారావు, సి పి డి సి ఎల్ ఎస్ఈ ఆంజనేయులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్చార్జి అధికారి సోమల నాయక్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# డా. ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

## అసోసియేట్ డీన్ డా. ఎం. సర్దార్ బేగ్ ఆధ్వర్యంలో నిర్వహణ!



బాపట్ల, ఆగస్టు 29 : భారతదేశం గర్వించదగిన దిగ్గజ హాకీ క్రీడాకారుడు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని, శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని డా. ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల, బాపట్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డా. ఎం. సర్దార్ బేగ్ మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్ చంద్ భారత హాకీకి అందించిన విశిష్ట సేవలు, ఆయన అద్భుతమైన క్రీడా ప్రతిభ, క్రమశిక్షణ మరియు దేశభక్తి నేటి యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమిష్టి కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ కొంత సమయాన్ని శారీరక వ్యాయామం మరియు క్రీడలకు కేటాయించాలని ఆయన సూచించారు. "ఏక్ గంటా ఖేల్ కే మైదాన్ మే" వంటి కార్యక్రమాలు యువతను క్రీడా మైదానాల వైపు ఆకర్షించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని, కృషి, క్రమశిక్షణ పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించాలని డా. సర్దార్ బేగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి కళాశాలకు, రాష్ట్రానికి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా "ఏక్ గంటా ఖేల్ కే మైదాన్ మే" అనే థీమ్తో కళాశాలలో ఒక గంటపాటు వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ కనీసం ఒక గంట సమయాన్ని క్రీడలు శారీరక వ్యాయామానికి కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనే సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమాన్ని డా అశోక్ కుమార్ నిర్వహించగా, బోధన సిబ్బంది డా రవి బాబు , డా రామి రెడ్డి, డా శ్రీనివాసుల రెడ్డి, డా విష్ణు వర్ధన్, డా రాజ్ కిరణ్, బోధనేతర సిబ్బంది విజయ కుమారి తదితరులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో జిల్లాలో రహదారులకు కొత్త వెలుగు



శ్రీకాకుళం,కోటబొమ్మాళి ఆగస్టు 29: జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు, రవాణా సౌకర్యాల మెరుగుదలకు రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టెక్కలి, నరసన్నపేట సహా, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న కీలక రహదారుల పునర్నిర్మాణానికి భారీగా నిధులు తీసుకురావడంలో ఆయన విజయం సాధించారు. మంత్రి అచ్చెన్నాయుడు నిరంతర కృషి, పట్టుదలతో ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా ముందస్తు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

డోల-పొలాకి-నౌపడ రహదారికి పూర్వవైభవం

జిల్లాలోని అత్యంత ప్రాధాన్యత కలిగిన డోల-పొలాకి-నౌపడ రహదారి విస్తరణ, బలోపేతం పనులకు నిధులు కేటాయించారు. ఈ పనులను రెండు విభాగాలుగా చేపడుతున్నారు:

మొదటి విడత (నరసన్నపేట/శ్రీకాకుళం పరిధి): కిలోమీటర్ 0/0 నుండి 17/0 వరకు మొత్తం 13.00 కిలోమీటర్ల పరిధిలోని రహదారి పనులకు రూ. 25.20 కోట్లు (రూ. 2,520 లక్షలు) మంజూరయ్యాయి.

రెండో విడత (టెక్కలి/శ్రీకాకుళం పరిధి): కిలోమీటర్ 17/0 నుండి 37/200 వరకు మిగిలిన 20.20 కిలోమీటర్ల పరిధిలోని రోడ్డు పనులకు రూ. 30.50 కోట్లు (రూ. 3,050 లక్షలు) కేటాయించారు.

మొత్తంగా డోల-పొలాకి-నౌపడ మార్గంలో 33.20 కిలోమీటర్ల పొడవైన రహదారి విస్తరణ కోసం రూ. 55.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు

కేంద్ర రహదారుల నిధి (సి ఆర్ ఐ ఎఫ్) స్కీమ్ ద్వారా నిధులు సమీకరించి, ఈ ముఖ్యమైన రహదారుల పనులకు జీవో (జీవో ఆర్టీ నం. 459, రవాణా, రహదారులు, భవనాల శాఖ, తేదీ: 28-08-2026) విడుదలయ్యేలా చేసిన మంత్రి అచ్చెన్నాయుడికి జిల్లా ప్రజలు, ఆయా ప్రజాప్రతినిధులు, వాహనదారులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తయితే తీరప్రాంత గిరిజన, మత్స్యకార గ్రామాలతో పాటు నరసన్నపేట, టెక్కలి, నౌపడ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థ మెరుగవుతుందని, ప్రయాణ సమయం తగ్గడంతో పాటు స్థానిక వ్యాపార, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ఎంతో ఊతం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

# రూ.24.35 కోట్ల ఎంపీలాడ్స్ నిధులతో అభివృద్ధి పనులు వేగవంతం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్టు 29: ఆర్థిక మంజూరు లభించిన నాలుగు నెలల్లోగా పనులు ప్రారంభం కాకపోతే ఆ ఎంపీ ల్యాడ్ నిధులను నిరుపయోగంగా ఉంచకుండా, తక్షణమే ఇతర అత్యవసర ప్రజా ప్రయోజన పనులకు మళ్లించి వినియోగించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం సాయంత్రం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి ఎంపీలాడ్స్ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఏజెన్సీలకు నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, జల జీవన్ మిషన్ పురోగతిపై ప్రతి రెండు వారాలకొకసారి స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తూ క్షేత్రస్థాయిలో పనుల వేగం పెంచాలని స్పష్టం చేశారు. అలాగే పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర పథకాల ఫలాలు అర్హులైన ప్రజలందరికీ త్వరితగతిన అందేలా అధికారులు సమర్థంగా పనిచేయాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటివరకు 346 పనులకు గాను రూ.2,098.29 లక్షలు మంజూరు కాగా, రూ.949.98 లక్షల వ్యయంతో 177 పనులు పూర్తి చేశామని, 29 పనులు వేగంగా జరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ-సాక్షి పోర్టల్ వివరాల ప్రకారం కేంద్రం నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.24.35 కోట్లు విడుదల కాగా, సీతంపేట ఐటిడిఏ పరిధిలో రూ.12.20 లక్షల పనులతో సహా మొత్తం రూ.2,108.69 లక్షల విలువైన ప్రజా ఉపయోగకర పనులను ఎంపీగా సిఫార్సు చేశానని, నిధుల కొరత లేకుండా మరో రూ.326.47 లక్షలు నూతన పనుల సిఫార్సుకు సిద్ధంగా ఉన్నాయని మంత్రి తెలిపారు. 28 రోజులకు మించి ఏజెన్సీల వద్ద సాధ్యత పరిశీలనలో ఉన్న 25 పనుల (రూ.137.95 లక్షలు) ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు మొదలుపెట్టాలని అధికారులను ఆదేశించారు.

సోలార్ పథకాల అమలుపై అధికారులకు ఆదేశాలు:

జిల్లాలో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ తదితర సౌర విద్యుత్ పథకాల అమలుకు సంబంధించి డేటా, పాలసీలు, లక్ష్యాలు స్పష్టంగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రగతి లేకపోవడంపై కేంద్ర మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 19 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, 56,000 గృహ యూనిట్లకు సౌర విద్యుత్ అందించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, సబ్సిడీ అందుబాటులో ఉందన్నారు. అయితే టెండర్-వెండర్ల ఖరారు, వినియోగదారుల సర్టిఫికేషన్ ప్రక్రియ, పాత ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల అప్‌గ్రేడేషన్, సైట్ అనుమతుల విషయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపారు. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా ఎవరు, ఏ పనిని, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే స్పష్టమైన బాధ్యతలతో కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఫేజ్-1 కింద ప్రాధాన్య ప్రాజెక్టులకు తక్షణమే వెండర్లను ఖరారు చేయడంతో పాటు, డిస్కం అధికారులు నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచి, విద్యుత్ మీటర్ల స్పెసిఫికేషన్లను ఖరారు చేయాలని, అలాగే 5 రోజుల్లోగా కస్టమర్ సర్టిఫికేట్ మంజూరయ్యేలా ప్రామాణిక నిర్వహణ విధానాన్ని (ఎస్ఓపీ) అమలు చేసి ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీతంపేట ఐటిడిఏ పిఓ స్వప్నిల్ పవార్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, సిపిఓ ప్రసన్నలక్ష్మి, ఆయా శాఖలో జిల్లా ఉన్నతాధికారులు తదితరులు హాజరయ్యారు.

# మాతృభాషకు సముచిత పీఠం

తెలుగు భాషా పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని

మంత్రి కందుల దుర్గేష్ ఉద్ఘాటన!

విజయవాడ అంబేద్కర్ కళావేదికలో వైభవంగా తెలుగు భాషా దినోత్సవం

సెప్టెంబర్ మొదటి వారంలో 'నంది నాటకోత్సవాలపై' కీలక ప్రకటన చేస్తామని వెల్లడి!

గిడుగు రామమూర్తి పంతులు 163వ జయంతి సందర్భంగా 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు-2026' ప్రదానం (రూ. 25,000 నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం బహూకరణ






విజయవాడ ఆగస్టు 29 : సెప్టెంబర్ మొదటి వారంలో నంది నాటకోత్సవాల నిర్వహణపై కీలక ప్రకటన చేస్తామని, ఏడాదిలోనే వీటిని కూటమి ప్రభుత్వం అత్యంత ఘనంగా నిర్వహిస్తుందని సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. విజయవాడ గవర్నర్ పేటలోని డా.బి.ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదానంలో ఉన్న డా. బీ. ఆర్. అంబేద్కర్ కళావేదికలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు 163వ జయంతి (తెలుగు భాషా దినోత్సవం) వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ 19 మంది ప్రముఖులకు 'తెలుగు భాషా పురస్కారాలు-2026' అందజేశారు. పురస్కార గ్రహీతలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికతో పాటు రూ. 25,000 నగదు బహూకరించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ప్రజలు మాట్లాడే భాషకు విద్యా సాహిత్య రంగాల్లో సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేసిన గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. గ్రంథాలకే పరిమితమైన తెలుగును ప్రజాక్షేత్రంలోకి తెచ్చిన మహోన్నతుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు అని కొనియాడారు. కందుకూరి, గురజాడ, గిడుగుల కృషి వల్లే వ్యావహారిక భాష ఉద్యమం రూపుదిద్దుకుందన్నారు. సవర భాషకు లిపిని రూపొందించి, బ్రిటిష్ ప్రభుత్వం తనకు ఇచ్చిన పారితోషికాన్ని సైతం ఆదివాసీల విద్యాభివృద్ధికి వెచ్చించిన త్యాగధనుడు, సంఘసంస్కర్త గిడుగు అని గుర్తుచేశారు. తెలుగు భాషా పురస్కారాల ఎంపికకు సంబంధించిన జి.ఓ ను కూడా తెలుగులోనే జారీ చేయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు మాతృభాషకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వ్యావహారిక భాషా సంఘాల ఏర్పాటుకు సాంస్కృతిక శాఖ తరఫున పూర్తి సహకారం ఉంటుందని, ఈ దిశగా చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం చైర్మన్‌కు సూచించారు. ఇంగ్లీష్, హిందీ నేర్చుకోవడం అవసరమే అయినా, మాతృభాషను మరువకూడదని పిలుపునిచ్చారు. కన్నతల్లి పాలతో పెరిగిన బిడ్డను మాతృభాషతో, పోత పాలతో పెరిగిన బిడ్డను ఆంగ్లంతో పోలుస్తూ ప్రాథమిక విద్య తెలుగులోనే సాగాలని నొక్కిచెప్పారు. ప్రతి ఏటా ఉగాది, కందుకూరి, తెలుగు భాషా పురస్కారాలను క్రమం తప్పకుండా ప్రదానం చేస్తామని వెల్లడించారు. పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్ మాట్లాడుతూ.. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా గుర్తింపు పొందిన తెలుగు భాషకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ తెలుగులో రాయడం, మాట్లాడడం, చదవడాన్ని ప్రోత్సహించినప్పుడే గిడుగు రామమూర్తి పంతులు ఆశయాలను నెరవేర్చినట్లవుతుందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో పని చేస్తుండటం వల్ల తనకూ తెలుగు భాషపై గౌరవం మరింత పెరిగిందన్నారు. గిడుగు రామమూర్తి పంతులు సాగించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగానే నేడు సామాన్య ప్రజలకు కూడా భాష ఎంతో చేరువైందని కొనియాడారు. సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి మాట్లాడుతూ.. తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి కృషి చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. గిడుగు జీవితాంతం చేసిన పోరాట ఫలమే నేడు మనం చదువుకుంటున్న సాహిత్యం, కావ్యాలు, పాఠ్యాంశాలని స్పష్టం చేశారు. భాషా వికాసానికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ.. తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నాటకరంగం ద్వారానే భాష ప్రజల హృదయాలకు మరింత చేరువైందని, త్వరలోనే నంది నాటకోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ్ రావు మాట్లాడుతూ.. వాడుక భాషా పరి వ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులు తమ జీవితాన్ని ధారపోశారన్నారు.కందుకూరి, గురుజాడ, గిడుగులతో పాటు సీపీ బ్రౌన్, పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి మహనీయులు తెలుగుకు అందించిన సేవలు అనన్యమైనవని గుర్తుచేశారు. 'ఐ లవ్ విజయవాడ' వంటి నామఫలకాలు తెలుగులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించారు. ప్రతి ఇంట్లో తెలుగు వినిపించాలని, సభా సంఘాల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

పుస్తకావిష్కరణ ఉ పురస్కార గ్రహీతలు:

ఈ వేడుకలో గిడుగు వేంకట రామమూర్తి పంతులు మునిమనవడు నాగేశ్వరరావు రచించిన 'కావ్య మల్లికలు' పుస్తకాన్ని మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. తెలుగు భాషా పురస్కారాలు అందుకున్న జంధ్యాల కనకదుర్గ, చందలూరి నారాయణరావు, యు.భూదేవి, కె.పుష్ప, ముత్తేవి రవీంద్రనాథ్, బాలాంతపు వెంకట రమణ, అబ్దుల్ హకీమ్ జాని, ఎస్.వి. రాఘవేంద్రరావు, పి.విజయ్ కుమార్, బొగ్గవరపు మాల్యాద్రి, చిలుకూరి శ్రీనివాసరావు, నాగసూరి వేణుగోపాలరావు, జంధ్యాల శరత్ బాబు, కోయి కోటేశ్వరరావు, కే.వి.ఎల్.ఎన్. శర్మ, ఎం.రామకృష్ణ, వీవీఐటీయూ పుస్తక ప్రచురణ సంస్థ, వేమూరి శ్రీనివాస్, కొల్లి రమావతి లు మాట్లాడుతూ.. భాషా వికాసానికి కృషి చేస్తున్న తమను గుర్తించి పురస్కారాలు అందజేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు కళావేదికకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు వివిధ జానపద నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కళా వేదిక ప్రాంగణంలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి నమస్కరించారు.. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి, మండలి వెంకటకృష్ణారావు అధికార భాష సంఘం చైర్మన్ పూల త్రివిక్రమ రావు, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, జానపద అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య రాష్ట్ర సాంఘిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య, గిడుగు వెంకట రామమూర్తి పంతులు ముని మనవడు నాగేశ్వరరావు తెలుగు భాషాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రీజెన్సీ స్కూల్లో తెలుగు భాషా మరియు జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు...




యానాం, మహి న్యూస్, ఆగస్టు 29: ప్రముఖ సంఘసంస్కర్త వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 163వ జయంతి వేడుకలు స్థానిక రీజన్సీ పబ్లిక్ హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక యానం ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు సి.హెచ్ రామలక్ష్మణుడు ముఖ్యఅతిథిగా పాల్గొని వేదికపై ఏర్పాటు చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు మరియు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళులు అర్పించి, విద్యార్థులకు తెలుగు భాషను వాడుకభాషలోకి తీసుకురావడానికి గిడుగు వెంకట రామమూర్తి పంతులు చేసిన కృషిని వివరించి తెలుగు భాష యొక్క ఔన్నత్యాన్ని,ప్రాముఖ్యతను తెలిపారు.తదుపరి పలువురు విద్యార్థులచే చేసిన ఉపన్యాసాలు,పాడిన పాటలు, అనర్గళంగా చదివిన పద్యాలు అందరిని ఆకట్టుకున్నాయి . పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి.ఎస్. ఎస్.వి ప్రసాదరావు మాట్లాడుతూ మన మాతృభాష తల్లిలాంటిదని మనం తల్లిని ఎంత గౌరవిస్తామో మన తెలుగు భాషను అంత గౌరవించాలని, పాశ్చాత్య భాషలు ఎన్ని నేర్చుకున్నా తెలుగు భాషను విస్మరించకూడదని విద్యార్థులకు సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు భాష ఉపాధ్యాయులు సిహెచ్ రామలక్ష్మణుడుని ప్రధానోపాధ్యాయులు దుస్సాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుభాషా ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ ఫ్యాట్రిక్స్ అకాడమీలో ఘనంగా జరిగిన తెలుగు భాషా దినోత్సవం



మహి న్యూస్ రావులపాలెం ఆగస్టు 29 : రావులపాలెం సెయింట్ ఫ్యాట్రిక్స్ అకాడమీలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించారు. అకాడమీ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ బినోయ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కమ్యూనిటీ లీడర్ రెవరెండ్ బ్రదర్ బోస్కో తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ నందర్భంగా రెవరెండ్ బ్రదర్ బినోయ్ మాట్లాడుతూ భాష అనేది ఒకరి



మనసులోని భావాలను మరొకరితో కలిసి పంచుకోవడానికి ఉపయోగపడే ఒక సాధనం అని అన్నారు. ముఖ్యముగా తెలుగు భాష ను ఎందరో కవులు మరి ఎందరో రాజులు అనేక విధాలుగా కొనియాడారని , శ్రీకృష్ణదేవరాయులు అంతటివారు " దేశభాషలందు తెలుగు లెస్స "అని అన్నారంటే తెలుగు భాష గొప్పతనం ఏమిటో మనము తెలుసుకోవాలని



అన్నారు. ముఖ్యఅతిథి గా విచ్చేసిన కమ్యూనిటీ లీడర్ రెవరెండ్ బ్రదర్ బోస్కో మాట్లాడుతూ మాట్లాడుతూ సప్త స్వరాలు పలికించే భాష తెలుగు భాష అని , తమిళ కవి సుబ్రమణ్య భారతి చే భాషలన్నిటిలో తెలుగు భాష సుందరమైనదని కొనియాడబడింది అంటే తెలుగు భాష యొక్క మాధుర్యము ఎంత గొప్పదో మనమందరము అర్థం చేసుకోవాలని అన్నారు. ఇంతటి సుందరమైన భాషను ప్రతి ఒక్కరికి చేరువలోకి తేవాలని నాటి కాలంలో వాడుకలో ఉన్న గ్రాంధిక భాషకు బదులుగా వ్యవహారిక భాషను వాడుక భాషలోనికి తేవడానికి ఎంతగానో కృషిచేసిన గిడుగు వేంకట రామమూర్తి పంతులుగారు జన్మదినాన్ని తెలుగు భాష దినోత్సవం గా గుర్తించడం ఎంతో గర్వకారణం అని ప్రతి సంవత్సరం ఆయన పుట్టినరోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ స్పోర్ట్స్ సెక్రటరీ రెవరెండ్ బ్రదర్ శశి రాజు, కోఆర్డినేటర్లు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భాషా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థిని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి , ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవం.





తాళ్లరేవు, మహి న్యూస్, ఆగస్టు 29: శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.వి. సురేష్ ఆధ్వర్యంలో, కాకినాడ రీజనల్ ఇన్‌చార్జ్ పిల్లా శ్రీనివాస్ పర్యవేక్షణలో స్థానిక సుంకరపాలెం శ్రీ చైతన్య పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపల్ డి.వి.వి. విజయలక్ష్మి గిరిధర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యత, ప్రాచీన వైభవం, మాతృభాష గొప్పతనాన్ని వివరించారు.



విద్యార్థులు ప్రదర్శించిన 'భువన విజయం' కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజాలను ఎనిమిది మంది పండితుల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. అలాగే ఆంధ్ర మహాభారతాన్ని తెలుగులోకి అనువదించిన కవిత్రయం నన్నయ, తిక్కన, ఎర్రన, ఆధునిక కవులు శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి, దాశరథి, గుర్రం జాషువా తదితరుల వేషధారణలో విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చారు. తెలుగు భాషకు విశేష సేవలందించిన మహనీయులను నేటితరం విద్యార్థులకు పరిచయం చేయడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ విజయలక్ష్మి గిరిధర్ పేర్కొన్నారు. విద్యార్థులను ఈ కార్యక్రమానికి అద్భుతంగా తీర్చిదిద్దిన శ్రీ చైతన్య తెలుగు భాషా హెచ్ఓడీ జి.ఎల్. ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు జే. హరీష్, ఎస్. తేజస్విని, తెలుగు ఉపాధ్యాయులు బి. వర్మ, జి. రామకృష్ణ, పి. సంధ్య, కె. శ్రీలక్ష్మి, శిరీషలను ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల సమక్షంలో సన్మానించారు. తెలుగు భాషాభివృద్ధికి వారు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సుంకరపాలెం డీన్ టి. వెంకటరత్నం, సి. బ్యాచ్ ఇన్‌చార్జ్ ఎం. శేషగిరిరావు, ఏఓ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జ్ ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బొక్కు సొర సంరక్షణపై అవగాహన




కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 29: ప్రపంచ బొక్కు సొర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడలోని ఎస్ఆర్ఎంటీ మాల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొక్కు సొర ప్రాధాన్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్రపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్.ఎస్.ఆర్. వరప్రసాద్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో బొక్కు సొరలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. బొక్కు సొరలను వేటాడటం, చంపడం చట్టరీత్యా నేరమని, వన్యప్రాణి సంరక్షణ చట్టం--1972 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. ప్రజలందరూ బొక్కు సొరలను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు సిద్ధార్థ, వీరభద్రరావు, ఎఫ్‌బీఓలు మహేష్, గోపినాగేంద్ర కుమార్, జగదీష్, రీసెర్చ్ సైంటిస్ట్ మహేష్ బాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్--3 పనుల పరిశీలనలో పెమ్మసాని

## శిల్పారామం--పెదపలకలూరు మధ్య 4.25 కి.మీ రహదారి అభివృద్ధి.. రూ.48 కోట్లతో పనులు



గుంటూరు మహి న్యూస్, ఆగస్టు 29: గుంటూరు నగర పరిధిలోని శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు చేపడుతున్న మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్--3 రహదారి అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ శిల్పారామం నుంచి పెదపలకలూరు వరకు సుమారు 4.25 కిలోమీటర్ల మేర ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్--3 పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలోనే ఈ ప్రాజెక్టును ప్రారంభించాలనే ఆలోచన ఉన్నప్పటికీ వైసీపీ హయాంలో పనులు ముందుకు సాగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, స్థానిక నాయకుల సహకారంతో రహదారి పరిధిలోని ఆక్యుపెంట్ల పునరావాసం, ఇతర సమస్యలను పరిష్కరించి పనులకు మార్గం సుగమం చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.48 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు పనుల్లో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. రహదారి నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో రోడ్డు ఎత్తు పెరగడంతో హైటెన్షన్ విద్యుత్ తీగలను మార్చాల్సిన అవసరం ఏర్పడిందని, ఇందుకు అదనంగా సుమారు రూ.2--3 కోట్ల వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ఎన్ఎస్‌పీ కాలువల వద్ద భవిష్యత్తులో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా అదనపు కల్వర్టులు నిర్మించాల్సిన అవసరం ఉందని, ఒక్కో కల్వర్టుకు సుమారు రూ.10--15 లక్షల అదనపు వ్యయం అవుతుందని తెలిపారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ప్రస్తుత ప్రాజెక్టులోనే వీలైనంత వరకు ఈ అదనపు పనులను చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరినట్లు చెప్పారు.

పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరణకు ప్రతిపాదన

ప్రస్తుత ఇన్నర్ రింగ్ రోడ్డును భవిష్యత్తులో కొత్తగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి మీదుగా పేరేచర్ల జంక్షన్ వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని పెమ్మసాని తెలిపారు. ఈ విస్తరణ పూర్తయితే పల్నాడు ప్రాంతం నుంచి వచ్చే ప్రజలకు ఇన్నర్ రింగ్ రోడ్డు ద్వారా అమరావతికి నేరుగా మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ అదనపు విస్తరణకు సుమారు రూ.15--20 కోట్ల అదనపు వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు తెలిపారు. అయితే అదనపు పనులకు ఇంకా ఆమోదం లభించలేదని స్పష్టం చేశారు. రహదారికి అవసరమైన డ్రైనేజీ కవర్లు, సెంటర్ లైటింగ్ వంటి సదుపాయాలకు కూడా అదనపు అంచనాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు.

**ఇన్నర్ రింగ్ రోడ్డుతో ప్రాంతీయ అభివృద్ధికి ఊతం**

ఇన్నర్ రింగ్ రోడ్డు అభివృద్ధి పూర్తయిన వెంటనే చుట్టుపక్కల ప్రాంతాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పెమ్మసాని తెలిపారు. ఇప్పటికే గత ఐదు--ఆరు నెలల్లో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర నిర్మాణాలు రావడం ప్రారంభమయ్యాయని, దీంతో ఈ ప్రాంతంలోని భూముల విలువలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు. రాబోయే రెండు--మూడు సంవత్సరాల్లో అభివృద్ధి కార్యకలాపాలు మరింత పెరిగితే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆదాయం పెరగడంతో పాటు సీఆర్‌డీఏ ద్వారా కూడా మరిన్ని అభివృద్ధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో కార్పొరేషన్, సీఆర్‌డీఏ వనరులను సమన్వయం చేసుకుంటూ ఇన్నర్ రింగ్ రోడ్డు పనులను సాధ్యమైనంత అద్భుతంగా పూర్తి చేసి, గుంటూరు నగరంతో పాటు అమరావతి, పల్నాడు ప్రాంతాలకు మెరుగైన రవాణా అనుసంధానం కల్పించేందుకు కృషి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

# జాతీయ వినియోగదారుల 16వ సదస్సుకు జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలికి ఆహ్వానం

## పుట్టపర్తిలో సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జాతీయ సదస్సు




అనంతపురం, ఆగస్టు 29: (మహి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించనున్న 16వ జాతీయ వినియోగదారుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని అనంతపురం జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలతను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ జి. నరేష్ కుమార్ ఆహ్వానించారు. శనివారం ఉదయం అనంతపురంలోని జిల్లా వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో అధ్యక్షురాలు ఎం. శ్రీలతను అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు టి. చెన్నప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిన్న తంబి చిన్నప్ప, జిల్లా సభ్యులు హసీన్ వలితో కలిసి జి. నరేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి సదస్సుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా జి. నరేష్ కుమార్ మాట్లాడుతూ న్యూఢిల్లీలోని వినియోగదారుల సమన్వయ మండలి, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సెప్టెంబర్ 12, 13 తేదీలలో పుట్టపర్తిలో 16వ జాతీయ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ రంగంలో పనిచేస్తున్న ప్రముఖులు, నిపుణులు, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, వినియోగదారుల న్యాయం, ఆహార భద్రత, నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల అవగాహన, వినియోగదారుల సమస్యల పరిష్కారం తదితర కీలక అంశాలపై జాతీయ స్థాయిలో చర్చలు, అవగాహన కార్యక్రమాలు ఈ సదస్సులో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం. శ్రీలత సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, దేశవ్యాప్తంగా మరియు రాష్ట్రవ్యాప్తంగా పాల్గొనే వినియోగదారుల ప్రతినిధులకు తమ విలువైన మార్గదర్శకత్వాన్ని అందించాలని కోరినట్లు జి. సురేష్ కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సు ద్వారా రాష్ట్రంలోని వినియోగదారుల ఉద్యమానికి మరింత బలం చేకూరడంతో పాటు, వినియోగదారుల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి మా అజెండా : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్ట్ 29 : శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ కంపెనీల సి.ఎస్.ఆర్ నిధులతో చేపడుతున్న పలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం నాడు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గుత్తేదారులు, పలు ప్రాజెక్టుల అధికారులు భాగస్వామ్యం అయ్యారు. ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో శ్రీకాకుళం నగరంలో గుణపాలెం, హడ్కో కాలనీ, ఏపీజే అబ్దుల్ కలాం పార్క్, ఆర్కె నగర్ పార్క్ ల ప్రస్తుత స్థితిని అడిగి తెలుసుకున్నారు. కోల్ ఇండియా సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో ఇచ్చాపురం, పాతపట్నం లలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలు, ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో జిల్లా కేంద్ర లైబ్రరీ నిర్మాణ పనులు, ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సి.ఎస్.ఆర్ నిధులతో ఆముదాలవలస, మందస లలో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంల గురించి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వినూత్నంగా ప్రారంభిస్తున్న 100 కోట్లు, వందమంది యువ పారిశ్రామికవేత్తలు కార్యక్రమం గురించి రామ్మోహన్ నాయుడు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2500 మందికి పైగా ఉపాధి లభిస్తుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ఇప్పటికే 35 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఎంపిక చేశామని అన్నారు. ఈ కార్యక్రమ ప్రచారానికి కేంద్ర మంత్రి స్థాయిలో కూడా ప్రోత్సాహం కావాలని కలెక్టర్ కోరారు. ఇందుకోసం సెప్టెంబర్ మూడవ వారంలో కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ కార్యక్రమాలు, బ్యాంక్ రుణాలు, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి తోడ్పాటు అందివ్వాలని స్పష్టం చేశారు. కొత్త పారిశ్రామిక వేత్తలను తయారు చెయ్యడం, వ్యాపారంపై అవగాహన కల్పించడం, ఉపాధి అంటే ఉద్యోగమే కాదు అనే అపోహను యువతలో తొలగించడం అనే అంశాలను ఎంచుకుని భవిష్యత్ లో ఈ కార్యక్రమాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురానున్నట్టు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అరసవల్లి పుష్కరిణి అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. పుష్కరిణి పనులు 50% పూర్తి అయ్యాయని అధికారులు స్పష్టం చేశారు. రాబోయే నవంబర్ నాటికి పూర్తి చెయ్యాలని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. పాత్రునివలస స్పోర్ట్ కాంప్లెక్స్, జవాన్ మిత్ర పార్క్, ధోబీ ఘాట్, పలాస ఆర్వోబి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కోడి రామ్మూర్తి స్టేడియం ఫేజ్ 1 పనుల గురించి ఆరా తీశారు. ఇవి డిసెంబర్ 31తేదీకి పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. పాతపట్నం వయాడక్ట్, ప్రతీ నియోజకవర్గంలో ఏం.ఎస్.ఏం.ఈ పార్క్, పొందూరు ఖాదీ అభివృద్ధి, మూలపేట పోర్టు అభివృద్ధి, పీజీ పేట, బుడగట్లపాలెం, మంచినీళ్ళపేట, జెట్టీల అభివృద్ధి, శ్రీకాకుళం నగరం నుండి సముద్ర తీరానికి 120 అడుగుల రివర్ బాండ్ రోడ్డు, ఆముదాలవలస రైల్వే స్టేషన్ కు శ్రీకాకుళం నగరం నుండి గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, నాగావళి రివర్ ఫ్రంట్ పార్క్, విజయాదిత్య పార్క్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, కామ్య కోకోనట్ బోర్డ్, పాత్రునివలస క్రికెట్ స్టేడియం, శ్రీకాకుళం బస్ స్టాండ్, ఇండిగో సి.ఎస్.ఆర్ నిధులతో శ్రీకూర్మం ఆలయ అభివృద్ధి పనులపై ప్రస్తుత స్థితిని రామ్మోహన్ నాయుడు ఆరా తీశారు.

నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ.. త్వరితగతిన వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండియా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తాళ్లచెరువులో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు

## రూ.4.75 లక్షల అంచనాతో ప్రతిపాదనలు.. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసేందుకు కృషి



అచ్చంపేట మహి న్యూస్, ఆగస్టు 29: తాళ్లచెరువు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా మార్పు కోసం ఒక అడుగు బృందం ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. చింతపల్లి చిన్న శౌరి ఇంటి సమీపం నుంచి కావూరి ఏసు ఇంటి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సంబంధిత అధికారులు పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట ఏఈ ధరణికోట శివయ్య రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు.



రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.4 లక్షల 75 వేలతో అంచనా వ్యయం (ఎస్టిమేషన్) సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను రాబోయే వీబీ రాంజీ పథకంలో ప్రతిపాదించి, సుమారు నాలుగు నెలల్లోపు పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తామని మార్పు కోసం ఒక అడుగు బృందం సభ్యులు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజల సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేదర రాఘవ రాజు, దుగ్గి శ్రీనివాసరావు, మేదర అజయ్, కొంపెర్ల గోపీచంద్, రేపూడి రాణి, రేపూడి తంబి, కోట మరియాబాబు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై వైసీపీకి చిత్తశుద్ధి లేదు

## మార్కాపురానికి కృష్ణాజలాలు రావడం జగన్ అండ్ కోకి ఇష్టం లేదు

## మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



మార్కాపురం, మహి న్యూస్, ఆగస్టు 29 : మార్కాపురానికి కృష్ణాజలాలు రావడం జగన్ అండ్ కోకి ఇష్టం లేదని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం మార్కాపురంలో వెలిగొండ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణ రెడ్డి , నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, పొంగూరు నారాయణ, మార్కాపురం జిల్లా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు . అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధిపై వైసీపీకి చిత్తశుద్ధి లేదు, మార్కాపురానికి కృష్ణాజలాలు రావడం జగన్‌కి ఇష్టం లేదు. ఈ ప్రాంతాన్ని ఓటు బ్యాంక్‌గా చూడటం దారుణం. వెలిగొండ ప్రారంభోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్నికల్లో చెప్పిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా చేశాం, వెలిగొండ పూర్తి చేశాం. 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబే..నేడు ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారు. చుక్క నీరు లేకుండా ప్రాజెక్టు జాతికి అంకితం చేసి ప్రజలను మోసం చేసిన ఘనత వైసీపీదే. జగన్ ఫేక్ వ్యక్తి, వైసీపీ ఫేక్ పార్టీ. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం. వెలిగొండ జలాలకు ప్రజలు హారతులతో స్వాగతం పలకాలి, చారిత్రాత్మక ఘట్టంలో ప్రజలంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు.

# ఎస్ వి యు అధ్యాపకులకు సి ఏ ఎస్ పదోన్నతులు కల్పించాలి



తిరుపతి,ఆగస్టు 29,మహి న్యూస్: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ (ఏబి ఆర్ ఎస్ ఎం) ఆధ్వర్యంలో ఎస్వీ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ తాతా నర్సింగరావు మరియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏం భూపతి నాయుడు ల ను కలిసి విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యల పైన వినతి పత్రాన్ని సమర్పించి సమస్యలను పరిష్కరించమని కోరడమైనది. ఈ సందర్భంగా ఏబి ఆర్ ఎస్ ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై వి రామిరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో దాదాపు రెండున్నర సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న అధ్యాపకుల పదోన్నతులకు సంబంధించిన కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ వెంటనే నిర్వహించాలని అదేవిధంగా అర్హత ఉన్న అధ్యాపకులు అందరికీ ప్రొఫెసర్ నుండి సీనియర్ ప్రొఫెసర్ కు పదోన్నతులు పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని విశ్వవిద్యాలయాలలో సీనియర్ అధ్యాపకులకు ప్రొఫెసర్ నుండి సీనియర్ ప్రొఫెసర్ గా పదోన్నతులు కల్పించారని ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులకు గుర్తు చేయడం జరిగినది. 2004 విశ్వవిద్యాలయ నోటిఫికేషన్ ద్వారా విశ్వవిద్యాలయంలో చేరినటువంటి అధ్యాపకులకు పాత పెన్షన్ వర్తింపు , విశ్వవిద్యాలయంలో స్వామి వివేకానంద, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాల ప్రతిష్ఠ, రాత్రి వేళల్లో అడవి జంతువుల నుండి రక్షణ, అకడమిక్ కన్సల్టెంట్ లకు అసిస్టెంట్ ప్రొఫెసర్( అన్ కాంట్రాక్టుగా )హోదా మార్పు, కాంట్రాక్టు మరియు గెస్ట్ అధ్యాపకులు అందరికీ మినిమం టైం స్కేల్ వర్తింపు, యూనివర్సిటీ హెల్త్ సెంటర్లో ఎక్సరే ,స్కాను మొదలైన వాటిని వినియోగములోనికి తీసుకురావడం మొదలైన విషయాలపై విశ్వవిద్యాలయ ఉపకులపతి మరియు రిజిస్ట్రార్ ల తో చర్చించడం జరిగింది. అదేవిధంగా 2026 విద్యా సంవత్సరానికి పీజీ మొదటి సంవత్సరం మరియు పరిశోధక విద్యార్థుల ప్రవేశాలు వెంటనే చేపట్టాలని కోరడమైనది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ తాతా నర్సింగరావు మరియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడులు మాట్లాడుతూ వీలైనంత తొందరగా సి ఎ ఎస్ పదోన్నతులు చేపడతామని అదేవిధంగా ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై వి. రామిరెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, ఇంజనీరింగ్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వరదరాజులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రొఫెసర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ జి వి రమేష్ బాబు, డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ ముని లక్ష్మి, డాక్టర్ గౌరీ శంకర్ డాక్టర్ వివేక్ మొదలగు వారు పాల్గొన్నారు.

## నేటి నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు
# కారీరిష్టి యాగం, వరుణయాగం, పర్జన్యశాంతి హోమం

తిరుమల : రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శ్రీ వేంకటేశ్వరస్వామివారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 3వ తేదీ వరకు వరుణయాగ, పర్జన్యశాంతి సహిత కారీరిష్టి యాగాలను టీటీడీ నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్త పండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్య అవధాని ఆధ్వర్యంలో ఇందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కార్యక్రమాల వివరాలు:

నేటి సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో అంకురార్పణ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. రేపటి నుండి సెప్టెంబర్ 3వ తేది వరకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో వరుణయాగం, కారీరిష్టి, పర్జన్యశాంతి కార్యక్రమాలతో పాటు ఏడు వేదశాఖల పారాయణం, రామాయణం, సుందరకాండ, విరాటపర్వం, ఋష్యశృంగ ధ్యాన పారాయణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. గోగర్భం డ్యామ్ వద్ద వరుణ, పర్జన్య మంత్ర అనుష్ఠానం నిర్వహిస్తారు. సాయంత్రం 6గం.నుండి రా. 8.గం వరకు ధర్మగిరిలో అగ్నిహోత్ర అనుష్ఠానం, ఏడు వేదశాఖల పారాయణం జరుగుతుంది. సెప్టెంబర్ 3న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# క్యూఆర్ కోడ్ సమస్యలను పరిష్కరించండి

తాసిల్దార్ షబ్బీర్ కు వినతిపత్రం సమర్పిస్తున్న బంగారుపాళ్యం రేషన్ డీలర్లు.



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం ఆగస్టు 29: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండల పరిధిలోని రేషన్ డీలర్లు శనివారం తాసిల్దారు షబ్బీర్ ను కలిసి తమ సమస్యలను వివరించారు.రేషన్ బస్తాలపైనా క్యూఆర్ కోడ్ స్కానింగ్ వల్ల రేషన్ డీలర్లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాసిల్దార్ షబ్బీర్ కు వినతిపత్రం అందజేసి కోరారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,సంఘ నాయకులు నరేష్,ప్రసాద్ మరియు మండలంలోని పలువురు డీలర్లు పాల్గొనడం జరిగింది.

## తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో
# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తిరుచానూరు,ఆగస్టు 29, మహి న్యూస్ : తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం మురళి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ వేడుకలకు డైట్ ప్రిన్సిపల్ విజయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష ఉపన్యాసంలో ప్రధానోపాధ్యాయులు ఎం మురళీధర్ మాట్లాడుతూ, వ్యవహారిక భాషా వికాసానికి గిడుగు రామ్మూర్తి అందించిన విశేష సేవలను కొనియాడారు. భాషా ఉపాధ్యాయులు ఎస్ వెంకట ముని మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వ్యవహారిక భాషను తీర్చిదిద్దిన ఘనత గిడుగు రామ్మూర్తికే దక్కుతుందన్నారు. పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ప్రోత్సహించి, మాతృభాషను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తెలుగు భాషపై పట్టు సాధించి అమ్మ భాష ప్రాధాన్యతను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయురాలు తేజోవతి గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలను విద్యార్థులకు వి వివరించారు.



బహుమతుల ప్రధానం -సాంస్కృతిక కార్యక్రమాలు

ముఖ్య అతిథి డైట్ ప్రిన్సిపల్ విజయానంద్ మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఇదే సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు తెలుగు భాషా ప్రాముఖ్యత, గిడుగు రామ్మూర్తి సేవలపై ప్రసంగించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హిమాచలం, వాసుకి, సురేంద్రబాబు, గణేష్, మునిరాజు, భూపాల్, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగిరి నియోజకవర్గంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు..



తిరుపతి ,ఆగస్టు 29,మహి న్యూస్ : చంద్రగిరి మండలంలో ఏనుగుల సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. భాకరాపేట ఘాట్రోడ్డు దాటి ఏనుగుల గుంపు చంద్రగిరి అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు గుర్తించారు. ఈ గుంపు భీమవరం, చిన్నరామాపురం, శేషాపురం గ్రామాల వైపు వచ్చే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.రాత్రివేళ రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దని, ఏనుగులు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఎన్ ఎస్ యు లో ఘనంగా సంస్కృత, తెలుగు భాషా దినోత్సవం



తిరుపతి,ఆగస్టు 29,మహి న్యూస్: ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ, న్యూఢిల్లీ కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో సంస్కృత తెలుగు దినోత్సవ వేడుకలు తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో వైభవంగా జరిగాయి. సంస్కృత సప్తాహ మహోత్సవాలలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు, విద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, సంస్కృత అధ్యయన కేంద్రాల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ప్రేరణాత్మక సందేశాలు

సంస్కృత సప్తాహ ఆంధ్రప్రదేశ్ అకాడమీ సమన్వయకులు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ పి.టి.జి.వి. రంగాచార్యులు మాట్లాడుతూ సంస్కృత భాషా ఔన్నత్యం, ఆధునిక భారతదేశంలో దాని పాత్ర, సంస్కృత తెలుగు భాషలలోని వైజ్ఞానిక ప్రాధాన్యతను వివరించారు. ఈ భాషలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆగస్టు 25న ప్రారంభమైన ఈ సప్తాహ మహోత్సవాల ద్వారా సంస్కృత భాషలోని జ్ఞానాన్ని నవతరానికి, సమాజానికి అందించడమే లక్ష్యమని తెలిపారు. సంస్కృతం ద్వారా వ్యక్తుల్లో ఉత్తమ గుణాలు పెంపొంది, సమాజ సంరక్షణకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచారం పరిషత్ అదనపు కార్యదర్శి ద్విభాష్యం కళ్యాణి మాట్లాడుతూ సనాతన ధర్మానికి సంస్కృతమే మూలమని, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సంస్కృతాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.



అవార్డులు ఉ బహుమతుల ప్రదానం

సంస్కృత భాషా వ్యాప్తికి విశేష కృషి చేసిన ఎల్. గురువరాజులు (తిరుపతి), సౌందర రాజన్ (చిత్తూరు)లకు అకాడమీ తరఫున అవార్డులు అందజేసి సన్మానించారు. సభాధ్యక్షులు ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డాక్టర్ రంగాచార్యులు చేతుల మీదుగా వీరిని గౌరవించారు. సప్తాహ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం అనువాద విభాగం డాక్టర్ ఎం.జి. నందన్ రావు, శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం డాక్టర్ భరత శేఖర్ ఆచార్య కోఆర్డినేటర్లుగా వ్యవహరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు, పురప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతిక నైపుణ్యాల పెంపుదల అవసరం

## తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు



తిరుపతి,ఆగస్టు 29, మహి న్యూస్: సాంకేతిక పరిజ్ఞానం వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, వాటి నియంత్రణతో పాటు కేసుల శీఘ్ర ఛేదనకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ నా సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ ప్రాంగణంలో నైలిట్ తిరుపతి సౌజన్యంతో నిర్వహించిన సైబర్ నేరాల దర్యాప్తు మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్ శిక్షణా కార్యక్రమ ముగింపు సభకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న 100 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారు.

కేసుల శీఘ్ర ఛేదనకు డిజిటల్ ఫోరెన్సిక్స్ కీలకం

నేరస్థులు డిజిటల్ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ నకిలీ వార్తలు, నకిలీ లింకులు, ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. డిజిటల్ ఆధారాల సేకరణ, విశ్లేషణ ద్వారా న్యాయమైన దర్యాప్తు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నేరస్థుల కంటే పోలీసులు ఒక అడుగు ముందుండాలని, నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

శిక్షణ నిర్వాహకులకు అభినందనలు

పోలీసు సిబ్బందికి శిక్షణ అందించిన నైలిట్ తిరుపతి సంచాలకులు శివకుమార్, శిక్షణ సభ్యులు అఖిల్, మనీష్ యాదవ్‌లకు ఎస్పీ ధన్యవాదాలు తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా సమన్వయం చేసిన అదనపు ఎస్పీ × రామకృష్ణ, సైబర్ విభాగ తనిఖీదారులు వినోద్, సమాచార సాంకేతిక విభాగ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# ఆగస్టు 30న చిత్తూరు జిల్లాలో నీట్ -పీజీ --2026 పరీక్ష పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు , మహి న్యూస్, ఆగస్టు 29: చిత్తూరు జిల్లాలో నీట్ -పీజీ--2026 పరీక్షను ఆగస్టు 30, 2026న ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 594 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్షకు హాజరుకానున్నారని, ఈనెల 30వ తేదీన పరీక్ష ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారని, అభ్యర్థులు ఎగ్జామ్స్ సెంటర్ కు ఉదయం 7.00 గంటల నుంచి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పలమనేరులోని మదర్ థెరిసా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కుప్పంలోని కుప్పం ఇంజినీరింగ్ కాలేజ్, ద్రావిడియన్ యూనివర్సిటీ పరీక్షా కేంద్రాలుగా ఉన్నాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తగినంత మంది పురుష, మహిళా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మినియేచర్ స్పై కెమెరాలు, కెమెరా కలిగిన కళ్లద్దాలు, ఇయర్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ పరికరాలు, చిట్స్, నోట్స్, పేపర్లు తదితర నిషేధిత వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్ పరీక్షల సమగ్రత, గోప్యతను కాపాడేందుకు సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, పరీక్షా కేంద్రాలకు సమీపంలోని సైబర్ పోలీస్ స్టేషన్ల ద్వారా సైబర్ ముప్పులను పర్యవేక్షించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పరీక్ష ప్రారంభానికి రెండు గంటల ముందుగానే నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాలు, ప్రవేశ ద్వారాలు, పరీక్షా గదులు, టేబుళ్లు, కుర్చీలు, మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు, నీటి ప్రదేశాలు, పరికరాలు, లిఫ్టులు తదితర ప్రాంతాలను పూర్తిగా శానిటైజ్ చేయాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునేలా ఏపీఎస్ఆర్టీసీ బస్సులను అవసరమైన మేరకు నడపాలని, పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు తిరుగు ప్రయాణానికి కూడా తగిన బస్సు సౌకర్యం కల్పించాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన వైద్య అత్యవసర సేవలతో పాటు తగిన సంఖ్యలో ఏఎన్ఎమ్ లను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు భంగం కలగకుండా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, 2023లోని సెక్షన్ 163ను అమలు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలోని జిరాక్స్ కేంద్రాలు, నెట్ సెంటర్లను పరీక్ష సమయంలో మూసివేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత తహసీల్దార్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ సక్రమంగా ఉండేలా కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు పరీక్షా కేంద్రాలను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. నీట్ -పీజీ--2026 పరీక్షను సజావుగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే మోహన్ కుమార్ పాల్గొన్నారు.

# బెస్ట్ సీఐగా కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ.



కాకినాడ, మహి న్యూస్, ఆగస్టు 29: కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో క్రైమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని సీఐలు, ఎస్సైలు తమ పరిధిలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, దొంగతనాల నివారణ, చోరీ సొత్తు రికవరీ తదితర అంశాల్లో చేపడుతున్న చర్యలు, పనితీరుపై సమీక్షించారు. కాకినాడ రూరల్ పోలీస్ పరిధిలోని కోరింగ, తిమ్మాపురం, ఇంద్రపాలెం, కరప, పెదపూడి, గొల్లపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, చోరీ సొత్తు రికవరీ తదితర అంశాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన రూరల్ సీఐ చైతన్యకృష్ణను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు. ఉత్తమ పనితీరుకు గుర్తింపుగా బెస్ట్ సీఐ అవార్డును ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా సీఐ చైతన్యకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా సీఐను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ఇదే స్ఫూర్తితో విధుల్లో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు

# బయో రిసోర్స్ సెంటర్లతో రైతులకు ఎంతో మేలు



ఒంగోలు, మహి న్యూస్, ఆగస్టు 29: రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిని ఆధ్వర్యంలో రెండు రోజుల బయో ఇన్‌పుట్ సెంటర్ పాయింట్ పర్సన్ల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బయో రిసోర్స్ సెంటర్ల (బీఆర్సీ) ఉద్దేశం, ప్రాధాన్యతను పాయింట్ పర్సన్ కు వివరించారు. అంతే కాకుండా కషాయాలు వారికి డెమో తయారుచేసి చూపించడం జరిగింది, ప్రకృతి వ్యవసాయాన్ని జిల్లాలోని అన్ని గ్రామాలకు మరింత విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో బయో రిసోర్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సాగులో ఎదుర్కొనే పురుగులు, తెగుళ్ల నివారణకు అవసరమైన ప్రకృతి వ్యవసాయ ద్రావణాలను బయో రిసోర్స్ సెంటర్ల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ ద్రావణాలను సరైన పద్ధతిలో వినియోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో పంటలను సాగు చేసి, మంచి దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అవసరమైన జీవ ఇన్‌పుట్లు అందుబాటులో ఉండేలా బయో రిసోర్స్ సెంటర్లు ఎంతో ఉపయోగకరంగా పనిచేస్తాయని, వీటి ద్వారా ప్రకృతి వ్యవసాయం మరింత మంది రైతులకు చేరువ అవుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ శ్రీమతి సుభాషిని మేడం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, మాధవి, వెంకటరావు, విజయలక్ష్మి, రాధా, రంజిత్ ,మాధురి ,దేవసేన, తదితరులతో పాటు బయో రిసోర్స్ సెంటర్ల పాయింట్ పర్సన్స్ పాల్గొన్నారు.

# చెంచుల ఉన్నతికి కట్టుబడి ఉన్నాం

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, మహి న్యూస్, ఆగస్ట్ 29 : గిరిజనుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ కట్టుబడి ఉన్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం నాడు శ్రీకాకుళం కలెక్టరేట్ లో చెంచు తెగకు సంబంధించిన జిల్లా సంఘం ఉన్నతి సభ్యులకు సున్నా వడ్డీతో బ్యాంక్ లింకేజ్ రుణం 8లక్షల రూపాయల చెక్కును అందించారు. చెంచు వృత్తి చేసుకునేవారు.. వారి సాంప్రదాయ వస్త్రాలను కొనుగోలు చేసేందుకు, ఇతర అవసరాల కోసం ఈ మొత్తాన్ని వినియోగించుకోవాలని కోరారు. కాగా సంక్రాంతి పండగ సమయంలో భోగి రోజున కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళం లోని ఆయన స్వగృహంలో చెంచు తెగకు చెందిన పలువురు భేటీ అయ్యారు. ఆ పాత సంప్రదాయాలను కొనసాగిస్తూ.. చెంచులు.. ఇంకా తమ కుల వృత్తిని కొనసాగించాలని రామ్మోహన్ నాయుడు వారిని కోరారు. ఈ సందర్భంలో తమ వృత్తికి కీలకంగా ఉండే తమ ఆహార్యంలో.. పలు వస్త్రాలను కొనుగోలు చెయ్యడానికి ఆర్థిక తోడ్పాటు అవసరమని రామ్మోహన్ నాయుడు ను చెంచులు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన రామ్మోహన్ నాయుడు.. ఐ.టి.డి.ఏ అధికారులకు సిఫార్సు చేశారు. కేంద్ర మంత్రి ఆదేశాల ప్రకారం.. ఉన్నతి సంఘం సభ్యులకు 8 లక్షల రూపాయల బ్యాంక్ లింకేజ్ రుణం చెక్కులు శనివారం అందజేశారు. వడ్డీ లేకుండా ఈ మొత్తం వస్తూ ఉండటంతో దీనిపై ఉన్నతి సంఘం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. రామ్మోహన్ నాయుడు కృషికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఐటీడీఏ పీవో స్వప్నిల్, శిక్షణ కలెక్టర్ హరి ఓం పాండ్య తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానంతోనే అంధకారంలో వెలుగులు



రణస్థలం, మహి న్యూజ్, ఆగస్టు 29: నేత్రదానం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ పి. జగన్మోహనరావు పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా రణస్థలం, జేఆర్ పురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీల్లో భాగంగా ఆయన మాట్లాడారు. కల్యాణ్ మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రం ద్వారా ఇప్పటివరకు 1,194 నల్లగుడ్లను సేకరించి ఎందరో అంధులకు దృష్టిని అందించామని ఆయన వివరించారు. ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సూరాపురం గ్రామానికి చెందిన ఎన్. ద్రాక్షాయణి, ఎన్. అచ్యుతరావులకు ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన రెడ్ క్రాస్ సిబ్బంది కె. సత్యనారాయణ, పి. చైతన్య, పి. సుజాత, పి. చిన్నకృష్ణ, టి. మనుకుమార్‌లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ ర్యాలీల్లో విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు. మరోవైపు స్థానిక రెడ్ క్రాస్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సాధారణ ప్రజలకు నిర్వహిస్తున్న సీనియర్ ప్రొఫెషనల్ ప్రథమ చికిత్స శిక్షణ ఆరో రోజుకు చేరుకుంది. ఆపద సమయంలో సమయస్ఫూర్తితో ప్రథమ చికిత్స అందిస్తే అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు, కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# రహదారులపై ఆక్రమణలు సరికాదు

ట్రాఫిక్ నియంత్రణకు, వాహనదారుల భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): నగరంలోని రహదారులను ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పాటు వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించడం ఏమాత్రం సబబు కాదని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. శనివారం బళ్లారి చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారి సర్వీస్ రహదారిపై ఉన్న ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు తొలగించారు. రహదారిపై ఉంచిన టైర్లు, శాశ్వత నిర్మాణాలను ఆక్రమణదారులు వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులు, రహదారులపై చోటుచేసుకుంటున్న ప్రమాదాలను వాణిజ్య దుకాణదారులు గుర్తించాలని సూచించారు. సామాజిక బాధ్యతగా వ్యవహరిస్తూ రహదారులను ఆక్రమించకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.



ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు రహదారులు, సర్వీస్ రోడ్లను ఆక్రమణలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి రహదారులను ఆక్రమిస్తే ఎలాంటి రాజీ లేకుండా ఆక్రమణలను తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం కమిషనర్ విష్ణు టౌన్‌షిప్‌లో మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్ మార్పు పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే పందిపాడులో నూతన డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నందికొట్కూరు రోడ్డులోని డిమార్ట్ సమీపంలో పిజిఆర్‌యస్ ఫిర్యాదుకు సంబంధించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ముజఫర్ నగర్ నూతన రైతు బజార్‌ను సందర్శించి డస్ట్‌బిన్‌ల వినియోగం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెట్కూర్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్‌ను కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈలు ప్రవీణ్ కుమార్ రెడ్డి, జనార్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎంజల్ ప్రణీత, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### 15 రోజుల పాటు ఎల్ఈడీ మొబైల్ వాహనంతో

# హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణ, ముందస్తు పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన



కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ మరియు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో 15 రోజుల పాటు ఎల్ఈడీ మొబైల్ వాహనం ద్వారా లైంగికంగా సంక్రమించే వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలులోని జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి కార్యాలయం వద్ద ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, ఏఆర్‌టీ నోడల్ అధికారి డాక్టర్ సోమప్ప ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎల్. భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలు, గ్రామాలు, పట్టణాల్లో ఎల్ఈడీ మొబైల్ వాహనం ద్వారా ఎస్‌టీఐ, హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధుల వ్యాప్తి, నివారణ, ముందస్తు పరీక్షలు, చికిత్స, అపోహల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా అవగాహన సందేశాలు, వీడియోలు, సమాచార చిత్రాలను ప్రదర్శించడంతో పాటు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష చూపకుండా సమాన గౌరవంతో వ్యవహరించాల్సిన అవసరాన్ని కూడా ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ 15 రోజుల కార్యక్రమంలో ముఖ్యంగా యువత, మహిళలు, సాధారణ ప్రజలు, అధిక ప్రమాద ప్రవర్తనకు గురయ్యే వర్గాలకు ఎస్‌టీఐ, హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణ చర్యలపై అవగాహన కల్పించనున్నారు. అవసరమైన వారికి సంబంధిత ఆరోగ్య సేవలు, హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్న విధానంపై మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అలీ హైదర్ మాట్లాడుతూ లైంగికంగా సంక్రమించే వ్యాధులు, హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణకు ప్రజల్లో అవగాహన అత్యంత కీలకమన్నారు. సరైన సమాచారం, సురక్షితమైన ఆరోగ్య ప్రవర్తనలు, సమయానికి పరీక్షలు, చికిత్స ద్వారా హెచ్ఐవీ వ్యాప్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కర్నూలు జిల్లాలో 15 రోజుల పాటు కొనసాగనున్న ఎల్ఈడీ మొబైల్ వాహన కార్యక్రమాన్ని ప్రజలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, సంబంధిత వర్గాలు సద్వినియోగం చేసుకుని హెచ్ఐవీ/ఎయిడ్స్ నిర్మూలనలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్షయ, లెప్రసి వైద్య అధికారి మల్లికార్జున రెడ్డి, ఏఆర్‌టీ వైద్యాధికారి అభిగేయల్, దేవి శంకర్ గౌడ, సీపీఓ రాజ్యలక్ష్మి, స్వచ్ఛంద సంస్థల మేనేజర్లు, ఏపీ సాక్స్ భాగస్వామ్య సంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాల్లో

# పటిష్ట భద్రతా ఏర్పాట్లు

ముఖద్వారం నుంచి శ్రీమఠం వరకు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఫాల్కన్ వాహనం, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీ కెమెరాల పరిశీలన

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 300 మంది పోలీసులతో బందోబస్తు



కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్ర స్వామి వారి 355వ సప్తరాత్రోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు నిర్వహిస్తున్న సప్తరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఎస్పీ మంత్రాలయంలోని ఆలయ పరిసరాలను, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖద్వారం నుంచి శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం వరకు పర్యటించిన ఎస్పీ భక్తుల రాకపోకలు, క్యూ లైన్లు, ఆలయ ప్రాకారం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను పరిశీలించారు. ఫాల్కన్ వాహనం, డ్రోన్ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెరాలు, సీసీ కెమెరాలు తదితర భద్రతా పరికరాల పనితీరును పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు





తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 300 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ శ్రీమఠంలోని క్యూ లైన్ ప్రాంతం, దేవాలయ ప్రాకారం, తుంగభద్ర నది తీర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం నిఘా నేత్రాలుగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను కూడా పరిశీలించారు. సప్తరాత్రోత్సవాల సందర్భంగా శ్రీమఠం ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు, భక్తుల కోసం కల్పించిన సౌకర్యాల గురించి మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి జిల్లా ఎస్పీకి వివరించారు. ఎస్పీ వెంట స్పెషల్ బ్రాంచ్ సీఐ మధుసూదన్‌రావు, మంత్రాలయం సీఐ దస్తగిరి, సీఐ రామాంజులు, శ్రీమఠం అధికారులు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

డ్రగ్స్ వాడకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా పెట్టాలి

గంజాయి సాగు చేస్తున్న వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి




కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా నిరంతరం నిఘా ఉంచడంతో పాటు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ, సంక్షేమ వసతి గృహాలు, ఈగల్ టీమ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడటం ప్రతి అధికారి బాధ్యతగా భావించాలని అన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా హాస్టళ్లలో వారి ప్రవర్తనను నిరంతరం గమనించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, మత్తు పదార్థాలకు సంబంధించిన కేసులు నమోదైతే ఎదురయ్యే పరిణామాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు, మీడియా తదితర ప్రచార మాధ్యమాల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లాలో డ్రగ్స్ రహిత వాతావరణం కల్పించేలా ఈగల్ టీమ్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లోని దుకాణాలపై గట్టి నిఘా ఉంచి, మత్తు పదార్థాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని చిప్పగిరి, పెద్దహరివాణం, హాలహర్వి, ఆలూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో రైతులు, ఇతరులు రహస్యంగా గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే వెంటనే కేసులు నమోదు చేసి, సాగును అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మిని ఆదేశించారు.



వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

సంక్షేమ వసతి గృహాల అధికారులతో మాట్లాడుతూ సిబ్బంది ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం, స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆదేశించారు. వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు, నీటి వసతి, దోమల నివారణకు మెష్‌ల ఏర్పాటు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే సంక్షేమ వసతి గృహాల్లో థర్డ్ పార్టీ ఆడిట్ నిర్వహిస్తామని హెచ్చరించారు. వసతి గృహాలకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర ఏర్పాట్లపై పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డీఈఓ సుధాకర్, ఎస్ఎస్ఏ పీఓ లోకరాజు, ఆర్ఐఓ లాలెప్ప, జిల్లా ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు రాధిక, ప్రసూన, డీవీవీ సురేష్‌బాబు, రెసిడెన్షియల్ స్కూల్స్ కోఆర్డినేటర్ పుష్పరాజ్, మైనారిటీ వెల్ఫేర్ అధికారిణి సబిహా పర్వీన్, జ్యోతిబా పూలే విద్యాలయ జూనియర్ లెక్చరర్ యమునాదేవి, లీగల్ టీమ్ ఎస్సై రమేష్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలి

గృహ నిర్మాణం, విద్య, ఎంఎస్ఎంఈ, వ్యవసాయ రంగాలకు రుణాలపై ప్రత్యేక దృష్టి

పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి




కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): జిల్లాలో బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని, ముఖ్యంగా గృహ నిర్మాణం, విద్య, సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), వ్యవసాయ మౌలిక వసతులు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంకర్లకు సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు సంబంధించిన రుణాల మంజూరు, లక్ష్య సాధన, పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించారు. విద్యా రుణాల విషయంలో బ్యాంకులు మరింత చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన విద్యార్థులకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణ రంగంలో రుణాల లక్ష్య సాధన కేవలం 12.45 శాతం మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి లక్ష్యాలను మెరుగుపరచాలని బ్యాంకర్లను ఆదేశించారు. వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన రుణాల పురోగతి కూడా ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రుణాల మంజూరును వేగవంతం చేయాలని సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి అధిక లక్ష్యాలు ఉన్నప్పటికీ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 49 శాతం లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకులు మరింత చొరవ చూపి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో వచ్చే త్రైమాసికంలో మెరుగైన పురోగతి సాధించాలని ఆదేశించారు.

ఎంఎస్ఎంఈలకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలి

జిల్లా ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనలో ఎంఎస్ఎంఈ రంగం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల పంపిణీలో బ్యాంకులు చురుకుగా వ్యవహరించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచించారు.

ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెరుగైన పనితీరు కనబరుస్తోందని పేర్కొంటూ, ఇతర బ్యాంకులు కూడా ఎస్‌బీఐ అనుసరిస్తున్న విధానాలు, కార్యాచరణ ప్రణాళికలను అధ్యయనం చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ రుణాల లక్ష్య సాధనలో కేవలం 11 శాతం ప్రగతిలో ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలాఖరులోగా కనీసం 50 శాతం లక్ష్యాన్ని సాధించేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు.



పశుపోషణకు రుణాలు అందించాలి

సాగునీటి సమస్యల కారణంగా రైతులు కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పశుపోషణ మంచి ప్రత్యామ్నాయ జీవనోపాధిగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన రైతులు, లబ్ధిదారులకు పశుపోషణ యూనిట్ల ఏర్పాటుకు ఎక్కువ సంఖ్యలో రుణాలు మంజూరు చేసి వారికి అండగా నిలవాలని బ్యాంకర్లను ఆదేశించారు. పశుసంవర్ధక యూనిట్లకు బీమా ఎంతో ముఖ్యమని, ప్రతి యూనిట్‌కు బీమా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పీఎం విశ్వకర్మ ముద్ర రుణాలపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పీఎం విశ్వకర్మ పథకం కింద పెండింగ్‌లో ఉన్న అర్హులైన లబ్ధిదారుల రుణ దరఖాస్తులను సెప్టెంబర్ నెలాఖరులోగా పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముద్ర రుణాల కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద రుణ దరఖాస్తుల తిరస్కరణలు అధికంగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరస్కరించబడిన దరఖాస్తులను ప్రత్యేకంగా పునఃపరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణ దరఖాస్తులు ఎందుకు తిరస్కరణకు గురవుతున్నాయో అధికారులు, బ్యాంకర్లు మూల కారణాలను గుర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించినప్పుడే రుణ లక్ష్యాలను సమర్థవంతంగా సాధించగలమని స్పష్టం చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో కేవలం నిబంధనలకే పరిమితం కాకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని బ్యాంకర్లకు సూచించారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రోత్సహించాలి

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్ పైకప్పుల ఏర్పాటును ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, బ్యాంకులతో సమన్వయం చేసుకుని రుణాలు సకాలంలో మంజూరయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రవీంద్రబాబు, కర్నూలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి. మోహన్, నాబార్డ్ డీడీఎం ఎం. సుబ్బారెడ్డి, కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, కెనరా బ్యాంక్ ఆర్‌సెటీ డైరెక్టర్ పుష్ప కుమార్, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రామాంజనేయులు, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబిహా పర్వీన్, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, మెప్మా పీడీ శ్రీనివాసులు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మేలుకో.. ఓటరుగా నమోదు చేసుకో..

కర్నూలు అసెంబ్లీ యువతకు ఈఆర్వో, కమిషనర్ పిలుపు

ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో 'స్పెషల్ క్యాంపెయిన్ డే'

ఫారం-6, 7, 8 ద్వారా ఓటర్ల జాబితాలో నమోదు, సవరణలకు అవకాశం



కర్నూలు, ఆగస్టు 29: (మహి న్యూస్): 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్న లిస్పెషల్ క్యాంపెయిన్ డేలిను అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం ఏ.క్యాంపులోని ఇందిరాగాంధీ మెమోరియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఈఆర్వో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, వివరాల సవరణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.



ఫారం-6, 7, 8తో దరఖాస్తు చేసుకోవచ్చు

ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనర్హులు, మరణించిన వ్యక్తులు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారి పేర్లపై అభ్యంతరం తెలియజేయడానికి లేదా తొలగింపు కోసం ఫారం-7ను వినియోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాల్లో మార్పులు లేదా సవరణలు చేసుకోవడానికి ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులైన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆదివారం నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డేలో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అర్హత కలిగిన యువతతో పాటు ఇప్పటికే ఓటర్లుగా ఉన్న వారు కూడా జాబితాలో తమ పేరు, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేరు ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైన సవరణలు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

